

గోపీమూర్తి గెలుపు ఖాయం

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి బి.గోపీమూర్తి గెలుపు ఖాయమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పిడిఎఫ్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, మొగల్తూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చింతపల్లి కృష్ణమోహన్, సిహెచ్.శ్రీనివాస్, కె.బ్రహ్మయ్య, చీపుర్ల సూర్యప్రకాష్, వై.శ్యాంబాబు, ఎన్.సువర్ణరాజు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి యడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక

పోలింగ్ ప్రశాంతం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

పశ్చిమలో 93.27 శాతం, ఏలూరు జిల్లాలో 91.60 శాతం ఓటింగ్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఏలూరు, పశ్చిమ కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణి

కాకినాడ తరలిన బ్యాలెట్ బాక్సులు

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక పోలింగ్ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రశాంతంగా ముగిసింది. రెండు జిల్లాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ 11 గంటల నుంచి ఊపందుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు రెండు జిల్లాల్లో 50 శాతానికిపైగా పోలింగ్ శాతం నమోదైంది. ఏలూరు జిల్లాలో 20, పశ్చిమలో 20 మొత్తం 40 కేంద్రాల్లో పోలింగ్ సాగింది. రెండు జిల్లాల్లోని ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు ఏలూరు జిల్లాలో 2,667 మంది, పశ్చిమలో 3,729 మంది ఉన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించారు. ఓటుహక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉపాధ్యాయ ఓటర్లకు ప్రత్యేక సెలవును విద్యాశాఖ మంజూరు చేసింది. ఏలూరు జిల్లాలో 2,667 మంది ఓటర్లకుగాను 2,443 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 1387 మంది పురుషులు, 1056 మంది మహిళలు ఉన్నారు. జిల్లాలో సాయంత్రం నాలుగు గంటల వరకు 91.60 శాతం పోలింగ్ నమోదైనట్లు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 3724 మంది ఓటర్లకుగాను 3,478 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసేసరికి 93.27 శాతం పోలింగ్ నమోదైంది. వీరవాసరం ఎంఆర్‌కె హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, చాటపర్రు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. భీమవరంలోని బాపిరాజు హైస్కూల్, కాళ్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. మహిళా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఓటు వేసేందుకు తరలొచ్చారు.

ఉభయగోదావరి జిల్లాల్లో గోపీమూర్తి సుడిగాలి పర్యటన

పిడిఎఫ్ అభ్యర్థి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి ఉభయగోదావరి జిల్లాల్లో సుడిగాలి పర్యటించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, ఉండి, గణపవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు జిల్లాలోని నిడమర్రు, ఏలూరు, భీమడోలు, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి, నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు, రాజమండ్రి వన్‌లో రెండు, టూటౌన్‌లో మరో రెండు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఆధ్యాపకులు పెద్దఎత్తున ఆదరించి ఓట్లు వేశారని కృతజ్ఞతలు తెలిపారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకుల పక్షాన నిలబడతారనేది మరోసారి రుజువవుతుందన్నారు. తాను మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే గెలుపొందే అవకాశాలున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి

మొదటి ఓటుతోనే గోపీమూర్తి గెలుపు ఖాయం

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి)

మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి గెలుపు ఖాయమని గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. భీమవరంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటర్లంతా ఉత్సాహంగా పోలింగ్ పాల్గొని ఓటు వేశారన్నారు. జూనియర్ కళాశాలలు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, అన్ని గురుకులాల వృత్తి సంఘాలు, సిఐటియు సంఘాల్లో బలంగా ఉన్నామని అందుకే మాది వృత్తి, వర్గ బంధమని, వందల సంఘాల బలం, ఓట్లున్నవారే కాకుండా లేని వారి బలం కూడా తమకుందని చెప్పారు. నూటికి నూరు శాతం గెలుపు తమదేనని స్పష్టం చేశారు.

ఓట్లు అభ్యర్థించిన ప్రజాసంఘాలు

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తికి ఓటు వేయాలని కోరుతూ పలు సంఘాల నేతలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓట్లు అభ్యర్థించారు. భీమవరంలో బాపిరాజు హైస్కూల్ సమీపాన ఏర్పాటు చేసిన శిబిరం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ప్రజాసంఘాల నేతలు ఆంజనేయులు, వైకుంఠరావు, ఇంజేటి శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ధనుష్, ఇతర నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన పోలింగ్.. తెరుచుకున్న మద్యం దుకాణాలు


ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే జిల్లాలో అన్ని మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. పోలింగ్ నేపథ్యంలో ఈ నెల మూడో తేదీ మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలను మూసివేశారు. 48 గంటలపాటు మద్యం దుకాణాలు మూసేసినప్పటికీ బెల్ట్‌షాపుల ద్వారా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. దీనిపై ఎక్సైజ్ అధికారులు నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

9న ఓట్ల లెక్కింపు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అందరి దృష్టి ఓట్ల లెక్కింపు, గెలుపోటములపై పడింది. బ్యాలెట్ బాక్సులను ఆయా జిల్లా కేంద్రాలకు తరలించి, అక్కడి నుంచి పటిష్టభద్రత నడుమ రాత్రికి కాకినాడలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. ఈ నెల తొమ్మిదో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. కాకినాడ జెఎన్‌టియులో కౌంటింగ్ పూర్తయిన అనంతరం ఫలితాలు ప్రకటించనున్నారు.

ఏలూరు జిల్లా పోలింగ్ సరళి

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. ఉదయం 10 గంటల వరకు 15.52 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకు 47.62 శాతం, మధ్యాహ్నం రెండు గంటలకు 74.58 శాతం, మధ్యాహ్నం 4 గంటలకు 91.60 శాతం పోలింగ్ నమోదైంది.



భీమవరంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి



ఆచంట : ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉపాధ్యాయిని

సెల్‌ఫోన్‌లకు దూరంగా.. చదువుకు దగ్గరగా

విద్యార్థులకు కలెక్టర్ నాగరాణి హితవు

మంచిగా విద్యాభ్యాసానికి అనువైన వసతి ఏర్పాట్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లాలోని వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో మరింత రాణించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం మండలంలోని పొలమూరులో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో కలెక్టర్ వసతిగృహం మొత్తం కలియదిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు. వసతిగృహంలో అత్యవసర మరమ్మతులను వెంటనే చేపట్టాలని జిల్లా గృహనిర్మాణ శాఖాధికారిని ఆదేశించారు. ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. టాయిలెట్లను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతిగృహం పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీ ప్రదేశంలో పూల మొక్కలను, కాయగూర మొక్కలను నాటాలని సూచించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ బాగా చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. భోజనం ఎలా ఉంటుంది, ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం కావడంతో కలెక్టర్ పిల్లలతో సహపంక్తి భోజనం చేసి, ఆహార పదార్థాలను రుచి చూశారు. ప్రతిరోజూ భోజనానికి ముందు పిల్లలు ఆలపించే ప్రార్థనాగీతాన్ని కలెక్టర్ స్వయంగా ఆలపించి, ఎలా పాడాలో పిల్లలకు నేర్పించారు. విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనానికి కూర్చున్న సందర్భంలో ఒక పిల్లవాడు ప్రశ్నిస్తూ 'అమ్మా.. మీరు నాతో భోజనం చేస్తున్నారేంటి' అని అడగ్గా 'మీరు తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ వసతిగృహాల్లో చదువుకుంటున్నారని, అందరూ సమానమే అనే భావన మీలో కలిగించేందుకే నేను మీతో కలిసి భోజనం చేస్తున్నాను' అని కలెక్టర్ బదులిచ్చారు. వసతిగృహం శ్లాబ్ మరమ్మతులు, నూతన టాయిలెట్స్ నిర్మాణానికి రూ.14.40 లక్షలు అంచనా వ్యయంతో ప్రతిపాదనలను పంపించారని, నిధులు మంజూరైన వెంటనే పనులను చేపడతారని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి జి.పిచ్చయ్య, తహశీల్దారు ఎవై.రవికుమార్, వసతిగృహ సంక్షేమాధికారి ఎంవి.సూర్యనారాయణ, ఎంఇఒ వి.నారాయణరావు, సర్పంచి కాకర రాజేశ్వరరావు ఉన్నారు.



పెనుమంట్ర : హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



కొణితివాడ బాలిక వసతి గృహంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్

వీరవాసరం: కొణితివాడలోని బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ నాగరాణి గురువారం సందర్శించి అక్కడ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అక్కడ బాలికలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. మానవ మనుగడకు మొక్కలు ఎంతో దోహద పడుతున్నాయన్నారు. ఆమె వెంట తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు, అధికారులు ఉన్నారు.

వైద్య సేవల్లో పిహెచ్‌సిలు ముందుండాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - వీరవాసరం

పేదలకు మెరుగైన వైద్య సేవలందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ముందు వరుసలో ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మండలం కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. తొలుత పిహెచ్‌సిని సందర్శించిన సందర్భంలో ఓపి విభాగం, ఆపరేషన్ థియేటర్, ప్రసూతి వార్డు, పురుషుల వార్డు, ఇంజక్షన్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఇంజక్షన్ రూమ్ వద్ద ఉన్న గర్భిణీతో మాట్లాడుతూ బలమైన పౌష్టికాహారం తీసుకుంటే శిశువు మెదడు బాగా ఎదుగుతుందని, తెలివైన పిల్లలు పుడతారని అన్నారు. రక్తహీనత లేకుండా సరైన ఆహారం అందించాలని గర్భిణీకి తోడుగా వచ్చిన భర్త, అత్తతో తెలిపారు. ప్రసూతి వార్డు వద్ద ప్రసవానికి సిద్ధంగా ఉన్న మహిళతో మాట్లాడారు. వైద్యం బాగా చేస్తున్నారా, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో మెడికల్ అధికారితో మాట్లాడుతూ గర్భిణులు, ప్రసూతి మహిళల్లో రక్తహీనత లేకుండా తరచూ పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించాలన్నారు. పిహెచ్‌సి పరిధిలో ఎన్ని టిబి కేసులు ఉన్నాయి, కుష్టు వ్యాధి రోగులు ఎంతమంది ఉన్నారు వారికి క్రమం తప్పకుండా మందులు అందజేస్తున్నారా అని ఆరా తీశారు. కేన్సర్ సర్వే ఎంతవరకు వచ్చింది, 10 సంవత్సరాలు, 16 సంవత్సరాలు బాలికలకు టిడి వ్యాక్సినేషన్ పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. ఎల్లప్పుడూ పిహెచ్‌సి వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఎంతోమంది పేదలు అనారోగ్యాలు కారణంగా ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి అప్పులు పాలవుతున్నారని తెలిపారు.



కొణితివాడ పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

మందకొడిగా ప్రారంభమై.. ఆపై ఊపందుకుని..

ముగిసిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వైద్య శిబిరాన్ని సందర్శించి మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా జరిగిందన్నారు. జెసి వెంట తహశీల్దార్ జి.సుందర్‌సింగ్, ఎంపిడిఒ జి.స్వాతి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆకివీడు: ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోలేదు.

గణపవరం: ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల శిబిరాన్ని పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి సందర్భంగా ఓటింగ్ సరళి గురించి స్థానిక యుటిఎఫ్ నేతలతో మాట్లాడారు.

ఆచంట: స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎంఎల్‌సి ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వర్ధనపు కిషోర్, ఆర్ఐ జయలలిత, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, హౌసింగ్ ఎఇ శ్రీరాములు నరేష్ పాల్గొన్నారు.

పెనుమంట్ర: స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎంఎల్‌సి ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఇక్కడ 84 మంది ఓటర్లకుగాను 78 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వీరవాసరం: స్థానిక ఎంఆర్‌కె జెడ్‌పి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 91.47 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 129 ఓట్లకుగాను 118 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని కలెక్టర్ నాగరాణి పరిశీలించారు.

తణుకు: పట్టణంలోని జాస్తి సీతామహాలక్ష్మీ గరల్స్ హైస్కూల్లో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నిరంతరం పోలింగ్ తీరును తహశీల్దార్ డివిఎస్ఎస్.అశోక్‌వర్మ తెలిపారు.




కాళ్ల : పోలింగు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జెసి రాహుల్ కుమార్‌రెడ్డి

మొగల్తూరు: మండల కేంద్రంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోలేదు.

తాడేపల్లిగూడెం: పట్టణంలో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక సుబ్బారావుపేట మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 92 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఆర్‌డిఒ కతీబ్ కౌసర్ భానో, డిఎస్‌పి విశ్వనాథ్, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

ఉండి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ప్రిసైడింగ్ అధికారి, ఉండి ఎఫ్‌డిఒ సిహెచ్.రాంబాబు మాట్లాడుతూ 69 మంది ఓటర్లకుగాను 63 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని పిడిఎఫ్ అభ్యర్థి బి.గోపీమూర్తి సందర్శించారు.



నరసాపురం : బ్యాలెట్ బాక్స్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ దాసి రాజు

ఆకివీడు: ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని తహశీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పోలింగ్ సరళిని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, నేతలు సత్యనారాయణ, ఆర్‌వి.నారాయణ, కె.తవిటినాయుడు, డోకల లక్ష్మి, పెంకి అప్పారావు, సందక ఉదయకుమారి తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: స్థానిక శ్రీ చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. పోలింగ్ సరళిని యుటిఎఫ్ జిల్లా నేతలు విజయరామరాజు, చెల్లబోయిన పట్టాభిరామయ్య, పి.సీతారామరాజు, పరిమి సూర్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, కె.ఆంజనేయులు, ఐ.శ్రీనివాస్, సిహెచ్.వెంకటేశ్వరరావు, కృష్ణ, నాగు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్

పోలింగ్ కేంద్రాన్ని జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. హెల్ప్ డెస్క్, వైద్యశిబిరాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. జెసి వెంట ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి: ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో 94 మంది ఓటర్లకుగాను 88 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని పోలింగ్ అధికారి ఏడుకొండలు తెలిపారు.

నరసాపురం: నరసాపురంలో 425 మంది ఓటర్లకుగాను 401 మంది ఓట్లు వేశారు. 95.35 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలోని పోలీసు స్టేషన్ సమీపంలోని మున్సిపల్ స్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. మొదటి రెండు గంటలు తక్కువ శాతం పోలింగ్ నమోదైనా మధ్యాహ్నం 12 తర్వాత జోరందుకుంది. ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి శ్రీవేద పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

మొగల్తూరు: ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆర్‌డిఒ దాసి రాజు సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. మొత్తం 88 ఓటర్లకుగాను 85 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తహశీల్దార్ కిషోర్ తెలిపారు.

పాలకొల్లు: స్థానిక బిఆర్‌ఎంవి మున్సిపల్ హైస్కూల్లో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ శాతం 92.50గా నమోదైంది. సాయంత్రం 4 గంటలకు మొత్తం 480 ఓట్లకు 266 మంది పురుషులు, 178 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు పోలింగ్ సరళిని పరిశీలించారు.

పాలకోడేరు: స్థానిక జెడ్‌పి హైస్కూల్లో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 102 మంది ఓటర్లకుగాను 99 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 97 శాతం పోలింగ్ నమోదైనట్లు తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి తెలిపారు. ఈ కేంద్రాన్ని భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎఎస్‌పి భీమారావు సందర్శించారు. స్థానిక ఎస్ఐ మంతెన రవివర్మ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లావ్యాప్తంగా 3478 మంది ఓటు హక్కు వినియోగం

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా 3478 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 20 మండలాల్లోని 20 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3729 మంది ఓటర్లు ఉండగా గురువారం జరిగిన పోలింగ్‌లో 3478 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 2116 మంది, మహిళలు 1471 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 251 మంది వివిధ కారణాల చేత ఓటు హక్కు వినియోగించుకోలేదు. జిల్లావ్యాప్తంగా 93.27 శాతం పోలింగ్ నమోదవ్వగా అత్యధికంగా ఆచంటలో 98.41, అత్యల్పంగా కాళ్లలో 86.54 శాతం పోలింగ్ నమోదైంది.

మండలం	ఓటేసినవారు	పోలింగ్ శాతం
అత్తిలి	88	97.78
ఆకివీడు	82	91.11
ఆచంట	62	98.41
భీమవరం	694	95.45
గణపవరం	63	95.45
ఇరగవరం	49	92.45
కాళ్ల	45	86.54
మొగల్తూరు	85	96.59
నరసాపురం	401	94.35
పెంటపాడు	68	93.15
పోడూరు	68	95.77
పాలకోడేరు	99	97.06
పెనుమంట్ర	79	92.94
పెనుగొండ	148	94.87
పాలకొల్లు	444	92.50
తాడేపల్లిగూడెం	353	93.63
తణుకు	381	93.61
ఉండి	63	91.30
వీరవాసరం	118	91.47
యలమంచిలి	88	93.62



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఇళ్ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరులో పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్లను గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయని, గృహ ప్రవేశాలు ఎన్ని జరిగాయని, మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి, నిరుపేద కుటుంబాలకు అందించి, వారితో గృహప్రవేశాలు చేయించాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ జి.పిచ్చియ్యను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం నిధుల కొరతతో నిలిచిపోయిన తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించి, వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ పూర్తి చేసేందుకు పూర్తి అంచనాలను సిద్ధం చేసి నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జ్ పీడీ జి.పిచ్చియ్య, తహశీల్దార్ ఎ.వై.రవికుమార్, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దంతాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థులు దంతాలపై అవగాహన కలిగి ఉండాలని రత్నాన్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ మేడపాటి మురళి జోగిరెడ్డి అన్నారు. వల్లూరు మెయిన్ పాఠశాలలో మానవత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. దంతాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు టూత్ పేస్టులు, బ్రష్‌లు, బిస్కెట్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు తాళం శ్రీనివాస్, వల్లూరు సర్పంచ్ నేలపూడి బేబీ పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రంలోని కోట రోడ్డులో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. యాత్రికులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దత్త సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సుగర్ పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక చాణిక్య కాలేజీలో ఉచిత సుగర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం సుగర్ వ్యాధిపై వారికి అవగాహన కల్పించారు. సుగర్ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ సూరిబాబు, క్లబ్ కోశాధికారి వి.విశారద, లయన్ కెఎస్ఎస్.మూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి హైదరాబాద్ పివిఎన్ఆర్‌టివిఐ యూనివర్సిటీ రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పెన్మెట్స దేవేంద్రరావు రూ.10 వేల విలువ చేసే పుస్తకాలను గురువారం జరిగిన కార్యక్రమంలో బహూకరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కెజిఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయన్నారు. దేవేంద్రరావుకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకట్, హరిబాబు, సతీష్, సంధ్య, జ్యోతి, మౌనిక పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న గుడిమెట్ల వెంకటేశ్వరరావు

ఫుడ్‌సేఫ్టీ సర్టిఫికేషన్

గోదావరి జిల్లాల హెడ్‌గా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ సర్టిఫికేషన్ అండ్ ట్రెయినింగ్ ఎఫ్ఒఎస్‌టిఎసి, కెవిజివిఎంకు సంబంధించి పశ్చిమ జిల్లా టీం హెడ్‌గా పాలకొల్లుకు చెందిన గుడిమెట్ల వెంకటేశ్వరరావును నియమించారు. ఎఫ్ఒఎస్‌టిఎసి, కెవిజివిఎం రాష్ట్ర నోడల్ ఆఫీసర్స్ మోహన్‌రావు, సింధు అధికారికంగా తెలిపారు. దేశంలో నిత్యం ఆహార పదార్థాల్లో అనేక విధాలుగా కల్తీ జరుగుతున్నందు వల్ల ఎఫ్ఎస్ఎస్ఎఐ, ఎఫ్ఒఎస్‌టిఎసి కోర్సును కెవిజివిఎం ద్వారా ప్రతి వ్యాపార సంస్థకూ ఫుడ్ సేఫ్టీ ట్రెయినింగ్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఇటీవల నిర్ణయించింది. ఈ మేరకు ఆహార పదార్థాలను ప్రతి వ్యాపార సంస్థా ఈ సర్టిఫికెట్ కలిగి ఉండాలని ఎఫ్ఒఎస్‌టిఎసి వారు తెలియజేస్తున్నారు. ఈ సర్టిఫికెట్ కెవిజివిఎం టీం త్వరలో ప్రతి వ్యాపార సంస్థ వద్దకు వెళ్లి వివరాలు తెలియజేస్తుందని, నూతనంగా నియమించబడ్డ టీమ్ హెడ్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆటో ఢీకొని యువకుడు మృతి

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని సోమరాజు ఇల్లింద్రపర్రులో ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన హరి (15) గురువారం మృతి చెందాడు. మృతుడు యంత్రంతో కోతలు కోసేందుకు ఇక్కడికి వచ్చినట్లు సహ కార్మికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో హరి మృతి చెందాడు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రేతలు అరెస్టు

22 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను భీమవరం ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ కె.బలరాం రాజు తెలిపారు. తాడేరు గ్రామానికి చెందిన జాన్ రత్నకుమార్ మద్యం అమ్ముతున్నట్లు సమాచారంతో అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే భీమవరం పట్టణంలో వి.కృష్ణమూర్తి మద్యం అమ్మడంతో అతనిపై దాడిచేసి 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధ్వానంగా కొమరాడ కాల్వ..!

ప్లాస్టిక్, థర్మకోల్ వ్యర్థాలతో నిండిన వైనం
పట్టించుకోని అధికారులు
గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - భీమవరంటౌన్

గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిందని, అదే పద్ధతిలో అధికారులు పనిలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించినప్పటికీ ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యం విడడం లేదు. వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా పంట కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతు కళేబరాలు, థర్మాకోల్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఈ కాల్వలగుండా ప్రవహించే నీటిని రైతులు పంట పొలాలకు వినియోగిస్తారు. అంతే కాకుండా పట్టణ, గ్రామ ప్రజలకు ఈ నీటినే శుద్ధిచేసి తాగునీరుగా సరఫరా చేస్తున్నారు. అయితే అధికారులు కాల్వల్లో చెత్తా చెదారాల తొలగింపుపై నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

భీమవరం నుంచి పద్మ థియేటర్ మీదుగా కొమరాడ నుంచి అన్నాకోడేరుతోపాటు కింది గ్రామాలకు సాగు, తాగునీరు అందించే కాలువ వెంబడి చెత్తాచెదారం పెరిగిపోయింది. అయితే పర్యవేక్షించాల్సిన అధికారి పట్టించుకోకవడంపై ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాల్వలో ఎటువంటి వ్యర్థాలు వేయకూడదని ఇరిగేషన్ శాఖ తూతూమంత్రంగా ప్రకటన బోర్డులు పెట్టి వదిలేసింది. అయితే ఎటువంటి అనుమతులు లేకుండా ఎన్నో వంతెనలు ఈ కాలువపై వేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై సొమ్ములు చేతులు మారాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాన్ లేఔట్లకు ఎటువంటి అనుమతి లేకపోయినప్పటికీ, కాలువపై తూతూమంత్రంగా వంతెనల నిర్మాణం చేపట్టడంతో ఈ వంతెనలు కాలువనీటిని అడ్డుకునే విధంగా ఉన్నాయి. ఈ వంతెన వద్ద పెద్ద ఎత్తున చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోవడంతో ఇక్కడ కాలం ఉందా లేదా అని అనుమానాలు కూడా వచ్చే విధంగా ఈ కాల్వ పరిస్థితి ఉందంటే అధికారి ఎంత బాధ్యతగా పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని ప్రజలు విమర్శిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే ఎన్నో ఫిర్యాదులు అందినప్పటికీ పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ కాలువపై ఉన్న అనధికార వంతెనలు తొలగించాలని, అలాగే వ్యర్థాలను కూడా ఎప్పటికప్పుడు తొలగించి స్వచ్ఛమైన సాగు, తాగునీరు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ప్లాస్టిక్, థర్మకోల్ వ్యర్థాలతో నిండిన కొమరాడ కాలువ

కేన్సర్ మహిళకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - ఉండి

ఏ ఆధారంలేక ఇబ్బందులు పడుతున్న వారికి చేయూతనిస్తేనే మానవత్వం అనిపించుకుంటుందని మానవత అధ్యక్ష కార్యదర్శులు పెన్మెత్స రామకృష్ణంరాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరుకువాడలోని కాపుల పేటకు చెందిన మాన్యం శివలక్ష్మి కేన్సర్‌తో బాధపడుతోందని, కనీసం పింఛన్ కూడా అందకపోవడంతో కుటుంబం గడవలేని పరిస్థితిలో ఉందని తెలుసుకుని దాత కడలి త్రివిక్రమ్ సహకారంతో ఆమెకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేసినట్లు వారు తెలిపారు. అనంతరం మానవత కో ఛైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బాధితురాలికి నిత్యావసరాలు అందజేస్తున్న మానవత

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వనమాల శ్రీనివాస్ తిరిగి రెండోసారి ఎన్నికయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నూతన సంఘాన్ని గురువారం ప్రకటించారు. అందులో నరసాపురం పట్టణానికి చెందిన వనమాలకు మరోసారి అవకాశం కల్పించారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ప్రముఖ న్యాయవాదిగా పేరుగాంచిన శ్రీనివాస్ రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ సంక్షేమ ఆధ్యక్షులుగా కూడా వ్యవహరిస్తున్నారు. రెండోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీనివాస్‌ను బిసి సంఘాల నాయకులు పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముద్దాడ గణేష్, సందక రామకృష్ణ, మేకా శంకర్, కొల కనకరాజు, ఆదినారాయణ, నరేష్, సాయిమూర్తి, వెంకట భాస్కర్, అప్పారావు, రమేష్ పాల్ పాల్గొన్నారు.

ఎన్‌సిసిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలకు ఎన్‌సిసి నావెల్ యూనిట్ మంజూరైనట్లు ఎన్‌సిసి 7ఏ నావెల్ యూనిట్, వైఎన్ ఎం కాలేజ్, నరసాపురం ఇన్‌ఛార్జ్ కమాండ్ ఆఫీసర్ సంజిత్ రౌత్రాయ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం ఎన్‌సిసిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి సంజిత్ రౌత్రాయ్ మాట్లాడారు. ఎన్‌సిసిలో చేరిన విద్యార్థులకు శారీర సౌష్టవం, క్రమశిక్షణ, దేశభక్తి, దేశ ఐక్యత పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు మాట్లాడారు. ఎన్‌సిసి యూనిట్ల ద్వారా విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో నాగబాబు, పంకజ్ శర్మ, దుర్గారావు, రాము, కళాశాల అకాడమిక్ అడ్వయిజర్ ఎన్.సీతారామారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎఎస్ఐ దాలయ్య మానవత్వం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోలీస్ అనగానే కొందరు పోలీసులు చేసే హడావుడీ వల్ల వాళ్లపై ప్రజల్లో కొంత అసహన భావన కనిపిస్తుంది. అయితే పోలీస్ శాఖలో పనిచేస్తూ ఎంతోమంది ఎదుటివారి కష్టాలను చూసి చలించి సొంత ఖర్చులతో వారి అవసరాలను తీర్చి నలుగురిలో మంచి గుర్తింపు తెచ్చుకుంటారు. అలాంటి వ్యక్తి భీమవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఎఎస్ఐగా పనిచేస్తున్న దాలయ్య. తాను విధుల్లో ఉన్నప్పుడు ఎవరికైనా కష్టం వస్తే ఆయన చలించిపోతారు. దీంతో వాళ్లకు ఆయన చేయగలిగిన సాయం చేస్తారు. గురువారం ఒక వికలాంగుడు కనీసం వీల్ ఛైర్ లేకుండా రోడ్డుపై దేకుతూ వెళ్లడంతో ఆ ఘటన చూసిన ఎఎస్ఐ దాలయ్య అప్పటికప్పుడు చెక్క పీటకు బేరింగ్‌తో వీల్ పీటగా తయారు చేయించి వికలాంగునికి అందజేశారు. ఇది చూసిన పట్టణ ప్రజలు మానవత్వం కలిగిన మంచి పోలీసు, ఫ్రెండ్లీ పోలీస్ దాలయ్య అని ప్రశంసిస్తున్నారు.



వృద్ధునికి చక్రాల పీటను అందజేస్తున్న ట్రాఫిక్ ఎఎస్ఐ దాలయ్య

అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు

ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి సతీమణి క్రాంతి రేఖ

ప్రజాశక్తి - భీమవరం

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు వేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి సతీమణి క్రాంతిరేఖ తెలిపారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత భీమవరంలో ఆమె మాట్లాడారు. ఎంఎల్‌సి అభ్యర్థిగా తన భర్త గోపీమూర్తి పేరును ప్రకటించిన నాటి నుంచి రాత్రి పగలూ తేడా లేకుండా ఆయన వెంటే ఉండి నడిపించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఓటర్లను దగ్గరుండి తీసుకొచ్చి ఓట్లు వేయించడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సమస్యలూ పరిష్కరించే విధంగా తన భర్త గోపీమూర్తితో పాటు తాను కూడా బాధ్యత తీసుకుంటానని తెలిపారు.



మాట్లాడుతున్న క్రాంతి రేఖ

రామలింగేశ్వర స్వామికి రూ.22.43 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం పోలీస్, రెవెన్యూ శాఖల సమక్షాన దేవాదాయ ధర్మదాయ తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలు లెక్కించగా 83 రోజులకు గాను రూ.22,43,859 ఆదాయం వచ్చింది. క్షీరా రామ సనాతన దాండియా గ్రూపు, శ్రీ హరే శ్రీనివాస కోలాట భజన మండలి సభ్యులు, విశ్రాంత బ్యాంక్, తపాలా శాఖ ఉద్యోగులు ఆర్ఎస్ శర్మ గ్రూపు సభ్యులు, డిఎస్ ప్రకాష్ ఇరుసుమండ సభ్యులు దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారులు సిబ్బంది పాల్గొన్నారని ఆలయ ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

రైతుల భూములకు సంబంధించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 6వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ జరిగే రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలని తహశీల్దార్ జి.కనకరాజు గురువారం తెలిపారు. గ్రామస్థాయిలో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే ఈ సదస్సులో భూములకు సంబంధించిన సమస్యలను తక్షణం పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 6వ తేదీ పెదమల్లం, 10వ తేదీ ఆచంట వేమవరం, 11న వల్లూరు, 12న కోడేరు, 13న అయోధ్యలంక, భీమలాపురం, 17న ఆచంట, శేషమ్మ చెరువు, 19న కరుగోరుమిల్లి, కందరవల్లి, 20న పెనుమంచిలి, 21న కొడమంచిలి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

తణుకు రూరల్ : రైతులు అడంగళ్ కరెక్షన్, మ్యుటేషన్, జిరాయితీ భూముల నమోదు వంటి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6 నుంచి తణుకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ డివివిఎస్.అశోక్‌వర్మ తెలిపారు. రైతులు పూర్తి డాక్యుమెంట్లతో హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. 6న కొమరవరం, 10న వేల్పూరు, 11న పైడిపర్రు, 12న తణుకు, 16న మండపాక, 17న తణుకు వేమవరం, 18న దువ్వ, 21న కోనాల, 23న ముద్దాపురం, 28న తేతలి గ్రామాల్లో ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నరసాపురం : మండలంలో ఈ నెల 6 నుంచి 26వ తేదీ వరకూ గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరో తేదీన మండలంలోని గొంది గ్రామంలో ఉదయం 9 గంటలకు గ్రామ సచివాలయం దగ్గర సదస్సు ప్రారంభం అవుతుందని తెలిపారు. 26వ తేదీ రుస్తుంబాద గ్రామంలో గ్రామ సదస్సుతో రెవెన్యూ సదస్సులు ముగుస్తాయని తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు, పంట భూములను వారసులకు బదిలీ చేయడం, తదితర భూములకు సంబంధించిన సమస్యలను ఈ సదస్సుల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని తహశీల్దార్ తెలిపారు. సంబంధిత పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని, వాటిపై విచారణ జరిపి సంబంధించి వ్యక్తులకు భూములను బదిలీ చేయటం జరుగుతుందని తెలిపారు. తహశీల్దార్‌తో పాటు మండల సర్వేయర్, ఆర్ఐ, విఆర్ఒ తదితరులతో కూడిన కమిటీ ఈ సదస్సుకు హాజరై సమస్యలపై వినతి పత్రాలు తీసుకుంటారని తహశీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



నరసాపురం : మాట్లాడుతున్న తహశీల్దార్ రాజరాజేశ్వరి

నేల పరిరక్షణపై ర్యాలీ

ప్రజాశక్తి - నరసాపురం

వైఎన్ కళాశాల సామాజిక సేవా కేంద్రం, భూగోళ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థలోని అత్యంత ముఖ్యమైన భాగాల్లో నేల ఒకటి అని తెలిపారు. మట్టిలోని జీవులు నేలలు కార్బన్‌ను నిల్వచేయడానికి, మొక్కల పెంపకం, కలుషితాలను క్షీణించడం, ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ, సామాజిక సేవా కేంద్రం సమన్వయకర్త భీమడోలు ప్రసాద్, కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ ఆనందకుమార్, ప్రసాద్, సుజిత, లక్ష్మి నాగలక్ష్మి, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ నేల దినోత్సవం గురువారం నవరసపురం గ్రామం రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఇ ఇ.అనిల్‌కుమారి మాట్లాడుతూ రైతులు భూమిలో పచ్చిరొట్ట పంటలు వేసి, పెంచి, కలియదున్నాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ లక్ష్మీనారాయణ, వి.ఎ.ఎ.సుధారాణి, ఉష, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : నేల పరిరక్షణ అందరి బాధ్యత అని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విచక్షణా రహితంగా ఎరువులు, ఇతర రసాయనాల వినియోగం వల్ల నేల, నీరు కలుషితం అవుతున్నాయన్నారు.



నరసాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హెచ్ఐవి రోగులు మంచి ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - తణుకు

ఎయిడ్స్ రోగులు సమయపాలన పాటిస్తూ మంచి ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తణుకు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థ అన్నారు. గురువారం స్థానిక తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని సేఫ్ కేర్ సెంటర్‌లో ఎయిడ్స్ రోగులు సుమారు 120 మందికి ప్రోటీన్ డబ్బాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.సత్తిరెడ్డి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ రెడ్డి రంగారావు, డాక్టర్ కెటివి రెడ్డి, జిల్లా ఎయిడ్స్ అధికారి హరనాథ్, బివివిఎస్ రామకృష్ణ, పోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఔత్సాహికులు 11లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో న్యాయసేవా కార్యకర్తలుగా పనిచేసే ఔత్సాహికుల నుంచి శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పి.విజయదుర్గ సూచించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి కనీస విద్యార్హతుండి, ఎలాంటి ధనార్జన ఆశించకుండా ఉండేవారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. విశ్రాంత ఉద్యోగులు, లా విద్యార్థులు, వైద్యులు, డ్వాక్రా మహిళలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, రాజకీయేతర సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల వారు ఈ నెల 11వ తేదీలోపు నరసాపురం కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని చెప్పారు.

మహారాజశ్రీ 1వ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 308/2016

Between:
Association for Promoting Spiritual & Socio-Economic Activities, regd No.571/84 rep by its Secretary Sri Boisakara Rao,
...Plaintiff

And

Ganta Venkata Ratnam (died) and Others
... Deffendants

10. Ganta Ananthalakshmi, W/o. late Venkataratnam, Hindu, Aged 52 years, House Wife, resident of Sai Balaji Complex, Opp: Dwakra building, Tanuku, W.G.Dt
11 Ganta Prathyusha, D/o. late Venkataratnam, Hindu, Aged 29 years, resident of Sai Balaji Complex, Dwakra building, Tanuku, W.G.Dt
...10,11Defendants

పై నెంబరు దావాలో10,11 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 11-12-2024** సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

G.S.S.Murali Mohan
రాజమండ్రి **G.V.Ramalakshmi**
01-11-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు వారి కోర్టులో, ఏలూరు జిల్లా.

O.S.No.605/2014

బిట్వీన్ :
గొర్రెల సింహాచలం ...ప్లయింటిఫ్
మరియు
గొట్టపు సూర్యాకాంతం వగైరా ...డిఫెండెంట్స్
టు:
D7 : శ్రీమతి టెక్కలి తులసమ్మ, W/o.సత్యనారాయణ, R/o.అపూర్వ ఫ్యాన్సీ షాపు స్ట్రీట్, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా.

పై దావాలో 7వ ప్రతివాది యొక్క హాజరు నిమిత్తం వాయిదా **ది.2-01-2025**వ తేదీన వాయిదా అయివున్నది. కావున 7వ ప్రతివాది ది.**2-01-2025**వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను. లేనిచో వారి పరోక్షంలో తీర్మానించబడును.

ఏలూరు **బి.గౌరీశంకర్,** అడ్వకేట్
ది.5-12-2024 ఏలూరు.
సెల్: 7416236226

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No.220/2023 in O.S.No.39/2021

Between:
వెలగల వెంకటరెడ్డి వగైరా
...పిటిషనర్లు/వాదులు
And
కాటం ఝాన్సీ లక్ష్మీభాయి వగైరా
...రెస్పాండెంట్లు/ప్రతివాదులు
To.
6th Respondent/6th proposed Defendant: Gollamandala Hima, W/o.Jagadeesh, C/o.Pammi Chitti Rapakapeta, Digamarru, Palakol Mandal, W.G.Dt.,
8th Respondent/8th proposed Defendant: Pammi Praveen Kumar, S/o.Late Venkata Rao, C/o.Pammi Chitti Rapakapeta, Digamarru, Palakol Mandal, W.G.Dt.,

పై నెంబరు పిటిషనులో 5 నుండి 8 రెస్పాండెంట్లను ప్రతివాదులుగా చేర్చమని కోరుచూ పిటిషనరు పిటిషన్ దాఖలు చేసినందున సదరు పిటిషనులో 6 మరియు 8 రెస్పాండెంట్లు హాజరు నిమిత్తం ది.**10-12-2024** సం.తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంథము జరుపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
నర్సాపురం న్యాయవాది,
తేది.05-12-2024 పాలకొల్లు, ప.గో.జిల్లా.